నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 7: కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్లు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. మూసాపేటలోని జీహెచ్ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జూలై 7 : మద్యానికి బానిసై వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ధర్మేశ్ తెలిపిన ప్రకారం.. ఏపీకి చెందిన దండు అప్పల్‌రాజు(42) తన భార్య రాజేశ్వరితోపాటు తన ఇద్దరు పిల్లలతో కలిసి గత కొన్నేండ్ల కిందట నగరానికి వలస వచ్చి దూలపల్లిలోని అయ్యప్పకాలనీలో నివాసం ఉంటూ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అప్పల్‌రాజు మద్యానికి బానిస కావడంతో ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుషి అరంగేట్రం అదిరింది..

కొండాపూర్, జూలై 7: సంగీత సప్తస్వరాలకనుగుణంగా నృత్య కదలికలతో ఆరుషి నాగభైరవ కూచిపూడి ఆరంగేట్ర నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకున్నది. ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ప్రముఖ నాట్య గురువులు నీలిమ గడ్డమణుగు సమక్షంలో ఆరుషి కూచిపూడి అరంగేట్ర ప్రదర్శన చేసింది. ప్రదర్శనలో విఘ్నేశ్వరుని ప్రార్థనతో ప్రారంభించి.. లింగాష్టకం, భామా కలాపం, తరంగం, అన్నమాచార కీర్తన, తిల్లాన, గోవింద నామాలను కూచిపూడి నృత్య రూపకంలో ప్రదర్శించిన తీరు విచ్చేసిన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ప్రదర్శనకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ.రమణలతోపాటు పలువురు ప్రముఖులు హాజరై ఆరుషిని ప్రత్యేకంగా అభినందించారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 7 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జి మిర్చి 48, కాకరకాయ 45, బీరకాయ 28, క్యాబేజి 33, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 28, దొండ 28, చిక్కుడు 95, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 21, క్యాప్సికం 70, ఆలుగడ్డ 39, కీరా 23, దోసకాయ 25, సొరకాయ 13, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 60 , ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి

■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, జూలై 7:ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి సద్వినియోగం చేసుకునే దిశగా కాలనీలు ముందుకు సాగాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మోహర్‌పార్క్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ (మంచినీటి శుద్ధికేంద్రం)ను ఆయన స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గుల్‌మోహర్‌పార్క్ కాలనీవాసులు బోర్‌వాటర్‌ను శుద్ధి చేసి కాలనీ అవసరాలకు వాడుకునేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. వినూత్నంగా ఆలోచిస్తూ అన్ని రంగాల్లో కాలనీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ మిగతా కాలనీలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుల్‌మోహర్‌పార్క్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాసీం, టీఎస్ఎల్ సంస్థ ప్రతినిధి కాశీవిశ్వనాథం, యూబీడీ డైరెక్టర్ విక్రమ్‌చందా, మాజీ కౌన్సిలర్ రామస్వామి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుల్‌మోహర్‌పార్క్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తా

మియాపూర్, జూలై 7 : కాలనీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదిక పూర్తి చేయించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చేస్తానన్నారు. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించి పలు అభివృద్ధి పనులను చేపట్టాలని కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని కోరారు. ఈ మేరకు ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. అసంపూర్తిగా ఉన్న రహదారులను పూర్తి చేయాలని, 100 ఫీట్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్, తాగునీటి వ్యవస్థను మరింత మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులు వెచ్చించి పటిష్టమైన తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసామని, రహదారులు, డ్రైనేజీలు, మెరుగైన విద్యుత్ వసతిని కల్పించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామని నిధులు సాధించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. త్వరలో కాలనీ వాసులతో సమస్యలపై పర్యటించి పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత సత్యనారాయణ, కాలనీవాసులు శ్రీకాంత్, కిశోర్, రాజేశ్వర్‌రావు, రామారావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీతో హుడా కాలనీవాసులు

నేరాల అదుపులో ప్రజల భాగస్వామ్యం అవసరం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



రంగానగర్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

జీడిమెట్ల, జూలై 7:నేరాల అదుపులో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం చింతల్ డివిజన్ పరిధి రంగానగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణే కాకుండా నేరాల దర్యాప్తును వేగవంతం చేయడంలో పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్, ఎస్ఐలు సతీశ్ రెడ్డి, నాయుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ రఫీ, మక్సూద్ అలీ, కన్నెకంటి మల్లేశ్, డేగా కృష్ణమూర్తి, శ్రీశైలం, బండారు వరప్రసాద్, అధ్యక్షులు జన్ను లక్ష్మణ్‌రావు, జనరల్ సెక్రటరీ కాట సతీశ్, రాంప్రసాద్, సత్యనారాయణ, సురేందర్, రామకృష్ణ, ఎల్లప్ప, ఆనంద్, సరోజ, అముల సతీశ్, పద్మ, లక్ష్మీనర్సయ్య, కుమార్, మహేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముప్పా సుబ్బయ్యకు ఘన నివాళి

మియాపూర్‌లో ముప్పా సుబ్బయ్య భౌతికకాయానికి పూలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. కోఆర్డినేటర్ సతీశ్‌ఆరోరా తదితరులు

ముప్పా సుబ్బయ్య(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 7: కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వెస్ట్‌జోన్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పా సుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మియాపూర్‌లోని ముప్ప సుబ్బయ్య నివాసంలో భౌతికకాయానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్‌ఆరోరా, మాజీ అధ్యక్షుడు సాయిబాబాచౌదరీలతో పాటు పలువురు రాజకీయ పార్టీల నేతుల పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలో చెరగని ముద్రవేసిన ముప్పా సుబ్బయ్య మరణంతో పలువురు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు.

పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కుత్బుల్లాపూర్, జూలై 7: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ సూచించారు. ఆదివారం సుచిత్ర చౌరస్తా నుండి అల్వాల్‌కు వెళ్లేదారిలో లయోలా అకాడమీ వద్ద వర్షం నీరు నిలిచిపోయే ప్రాంతంతో పాటు జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ చెరువు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌టీపీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిమెట్ల డివిజన్‌లో పూర్తికావచ్చిన ఎస్‌టీపీని సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 28న ప్రారంభించేందుకు ఆస్కారం ఉందని, ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. చెరువు చుట్టూ సందర్శించి నిలిచిపోయిన నీరు, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు.

జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ చెరువును సందర్శిస్తున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్, కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహ, ఏఎంహెచ్ఓ భార్గవ్‌ప్రసాద్ తదితరులు

షిర్డినగర్‌లో సమస్యలు పరిష్కరిస్తా..

పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

మియాపూర్, జూలై 7 : షిర్డినగర్ కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో కలిసి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కాలనీ అసోసియేషన్‌కు ఆఫీస్ నిర్మాణం, ఓపెన్ నాలాలో వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మోజెస్, కాలనీ వాసులు శ్రీధర్, మూర్తి, అమరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌సింగ్, సురేశ్, సాయిబాబా, కరుణాకర్, సారంగపాణి, శ్రీనివాస్, సాయికుమార్, అశోక్, రామ్‌గోపాల్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణపై కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

కుత్బుల్లాపూర్, జూలై 7 : మాదిగల వర్గీకరణపై ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ బిల్లును రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి అమలు చేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం జాతీయ నాయకులు ముక్కెర్ల లాలయ్య, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏండ్లు కావడంతో కుత్బుల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల ప్రతినిధులు ఆయా డివిజన్లు, ప్రధాన చౌరస్తాలో సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిజాంపేట్‌లోని సాయినగర్‌లో జరిగిన జెండావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ దండోరా మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.మల్లిఖార్జున్, ఎం.శ్రీను, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబ శివారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రాసమల్ల యాదగిరి, భారతి, లక్ష్మి, జహంగీర్, ఉప్పలయ్య, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

నిజాంపేట్ సాయినగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ చేసిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నేతలు

నిజాం కార్పొరేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డి దంపతులు అన్నారు. కార్పొరేషన్ పరిధి 12వ డివిజన్‌లోని శ్రీసాయినాథ్ కాలనీకి సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం హిల్‌కౌంటీలోని మేయర్ నివాసంలో మేయర్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో నెలకొన్న సమస్యలను వివరిస్తూ మేయర్ దంపతులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీసాయినాథ్ కాలనీకి సంక్షేమ సంఘం ప్రతినిధులు నర్సింహా రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

– దుండిగల్, జూలై 7

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అల్లాపూర్, జూలై7:వయోవృద్ధులు తరచూ వైద్యులను సంప్రదించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకుని వైద్య ల సూచనల మేరకు మందులు వాడాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మోతీనగర్ కమిటీ హాల్లో ఎస్‌వీ సాయిప్రసాద్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వయో వృద్ధులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్.అంజిరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్ గండిమైసమ్మ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ ఫిర్యాదు

దుండిగల్, జూలై 7: గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బహదూర్‌పల్లిలోని సర్వే నంబర్ 238, 239 ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని దుండిగల్ మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ భరత్‌కుమార్, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్‌కు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో120 గజాల ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి ఇందిరమ్మ పట్టాల పేరిట ఎలాంటి అనుమతులు లేకుండానే నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. సర్వే నం.239 సర్కారు భూమిలో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు గతంలో కొంత భూమిని కేటాయించారన్నారు. మరికొంత స్థలాన్ని బహదూర్‌పల్లిలో ఇండ్లు లేని నిరుపేదలకు 1988-85లో ఇందిరమ్మ పట్టాల పేరిట 120 గజాల చొప్పున పేదలకు సుమారు 25 పట్టాలు పంపిణీ చేశారన్నారు. అయితే అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణానికి.. ఎటువంటి పట్టా లేదని, నిర్మాణదారులు పట్టాను ట్యాంపరింగ్ చేసి నకిలీ పట్లాను సృష్టించడంతో పాటు అక్రమంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నట్లు ఆరోపించారు. సదరు నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

తాసీల్దార్ మతిన్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ భరత్‌కుమార్

■ కనుల పండువగా జగన్నాథ రథయాత్ర

రథయాత్రలో బలభద్ర సుభద్రల ప్రతిమల ఊరేగింపు

మియాపూర్, జూలై 7: జగన్నాథ రథయాత్ర శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో డైరెక్టర్ మహాశృంగదాస నేతృత్వంలో హైదర్‌నగర్‌లోని విజయలక్ష్మి దేవాలయ ప్రాంగణం వద్ద ప్రారంభమైన ర్యాలీ కూకట్‌పల్లి మెట్రో వరకు సాగింది. వందలాది భక్తుల కోలాట నృత్య ప్రదర్శనలు హరే రామ హరేకృష్ణ సంకీర్తనలతో భక్తిరసమయంగా రథయాత్ర ఆద్యంతం భక్తి పారవశ్యం నెలకొన్నది. అడుగడుగునా భక్తులు జయజయ ధ్వానాల నడుమ రథయాత్రకు స్వాగతం పలికారు. రథం ఎదుట బంగారు చీపురుతో శుభ్రం చేసి ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా భక్తులకు మహా ప్రసాదాన్ని అందించారు.

రథయాత్రలో సాంస్కృతిక కోలాట ప్రదర్శన

పూరి జగన్నాథస్వామి వారికి ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్‌లో ఒడిశాకు చెందిన హిందూ సమాజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పూరి జగన్నాథస్వామి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆయన స్వామివారిని దర్శించుకొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. – బాలానగర్, జూలై 7

వారాహి నవరాత్రి పూజలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని దుర్గామాత ఆలయంలో శనివారం ప్రారంభమైన వారాహి నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, పురప్రముఖులు, టీడీపీ నేత లీడర్ నర్సింహరెడ్డి తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. – దుండిగల్, జూలై 7

ముగిసిన జాతీయ నృత్యోత్సవాలు

కొండాపూర్, జూలై 7: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న సృజన జాతీయ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల భరతనాట్య నృత్యాలు, కథాకళి, రాజస్థానీ నృత్యాలు, ఒడిస్సీ, ఛత్తీస్‌గఢ్ నృత్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. రెండురోజులుగా జరుగుతున్న జాతీయ నృత్యోత్సవాలకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు అంజనాచౌదరి అన్నారు. ప్రదర్శనల అనంతరం కళాకారులను ఆమె ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జూలై 7 : బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి, శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో రోడ్డు వెడల్పు పనుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బాచుపల్లిలోని కేఆర్‌సీఆర్ కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, బాచుపల్లి చౌరస్తా నుంచి మల్లంపేట్ విలేజ్ వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి తమతో సహకరించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్, జూలై7 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చొట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్(సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 10నుంచి 11.30 గంటల వరకు గౌతంనగర్ ఏరియా బాలానగర్ ప్రాంతాల్లో, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు టీఐఈ బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో పరిధిలోని వసంత టూల్స్, టెక్నోక్రాట్స్ బాలానగర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన సూచించారు.

BEFORE THE HON'BLE PRINCIPAL DISTRICT SESSIONS JUDGE-CUM-FAMILY COURT MACT TRIBUNAL MEDCHAL MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI
M.V. O.P. NO. 16 OF 2021

Between: -
Mr Varun Sunil Raj Wood , S/o. D F Vasanth Raj Wood ,and Others. ...Petitioners
AND
1) Zoom Car India Pvt Ltd,Represented by Mr. Servesh M Chillavanth.
....Respondents
To.
Zoom Car India Pvt Ltd,Represented by Mr. Servesh M Chillavanth Plot. No. 157, South Part, 4th Floor, Kavuri Hills, Madhapur, Guttala Begumpet, Serlingampally, Ranga Reddy Dist, T.S.
...Respondents 1
Please take Notice that the above named Petitioner filed above OP against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 26-7-2024 .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF THE COURT)
CH.OMERNATHAN,Advocate
H.No.10-3-64,and 65,Jewel Residency Teachers Colony,Secunderabad.